క్లుప్తంగా

మాల ప్రజాసంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్‌గా మధుబాబు



నియామకపత్రం అందుకుంటున్న మధుబాబు

నల్లగొండ : పట్టణానికి చెందిన లకుమాల మధుబాబు మాల ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్‌గా నియమితులయ్యారు. గురువారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గండమల్ల చెన్నయ్య, వైస్ చైర్మన్ తాళ్లపల్లి రవి పాల్గొని జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా కన్వీనర్‌గా లకుమాల మధుబాబు, కో కన్వీనర్లుగా చింతపల్లి బాలకృష్ణ, అంగరాజు స్వర్ణలత, నామ చక్రవర్తిని ప్రకటించి వారికి నియామకపత్రాలు అందజేశారు. సమావేశంలో మాల ప్రజాసంఘాల జేఏసీ వైస్‌చైర్మన్లు బేర బాలకిషన్, బూర్గుల వెంకటేశ్వర్లు, మేక వెంకన్న, గోపోజు రమేష్‌బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొప్పని నగేష్, సప్పిడి సావిత్రి, యనమల్ల అనిల్, రొయ్య కిరణ్, దిండి ప్రసాద్, ముదుసు భిక్షం, రామాంజనేయులు, నాగటి సజన్, జోసఫ్, యాదాద్రి జిల్లా అధ్యక్షులు లలిత, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

నల్లగొండ టూటౌన్ : అనారోగ్యంతో మంచానికే పరిమితమైన నల్లగొండ పట్టణానికి చెందిన జంపాల గోపాల్‌కు న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శివలీల, సమాచార హక్కు సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంజయ్య, లక్ష్మీబాయి, మహేష్, ప్రభుదాస్, ప్రకాష్ పాల్గొన్నారు.

రాములమ్మకు ఘన నివాళి



రాములమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, తదితరులు

నల్లగొండ : పట్టణానికి చెందిన డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మునగాల సోమయ్య తల్లి రాములమ్మ ఇటీవల మృతి చెందింది. గురువారం ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సోమయ్య కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రాములమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, లక్ష్మారెడ్డి, మాణిక్‌రెడ్డి, ఎడ్ల సైదులు, వెంకటేశం ఉన్నారు.

నిత్యావసరాలు అందించాలి

చండూరు : రేషన్‌కార్డు కలిగిన పేదలకు ప్రతి నెలా రేషన్‌దుకాణం నుంచి బియ్యంతో పాటుగా తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు అందించాలని కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కాసాల వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండలంలోని కోటయ్యగూడెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ గోధుమలను రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కేవలం హైదరాబాద్‌లో పంపిణీ చేస్తుందన్నారు.

ప్రజా సమస్యలను విస్మరించిన ప్రభుత్వాలు



ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న ఇస్మాయిల్‌పల్లి గ్రామస్తులు

కట్టంగూర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరించాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఇస్మాయిల్‌పల్లి గ్రామంలో జరిగిన పార్టీ శాఖ మహాసభలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు వారి సమక్షంలో పార్టీలో చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, శ్రీను ఉన్నారు.

నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వేణుకుమార్



వేణుకుమార్

చండూరు : మున్సిపల్ కేంద్రానికి చెందిన కొలను వేణుకుమార్ ఆర్థిక ఇబ్బందులు అడ్డువచ్చినా లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. ప ద్మశాలి కుటుంబానికి చెందిన వేణుకుమార్ ను తండ్రి చంద్రమౌళి కష్టపడి మగ్గం నేసి చదివించాడు. చిన్న కుమారుడైన వేణుకుమార్ ఎ లాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని సన్నద్ధమయ్యాడు. ఇటీవల వెల్లడైన ఫలితాల్లో టీ జీటీ మ్యాథ్స్‌లో జోన్ 5లో 1వర్యాంక్, పీజీటీలో 32వ ర్యాంక్, అదేవిధంగా జూనియర్ లెక్చరర్ 75వ ర్యాంక్, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ లో జిల్లా 2వ ర్యాంక్ సాధించాడు. గ్రూప్–4లో షార్ట్ లిస్ట్‌కు ఎంపికయ్యాడు.

శాలిగౌరారంలో నీటి కష్టాలు

- వట్టిపోయిన పంచాయతీ బోరు
- ఆరు నెలలుగా అందని తాగునీరు
- నిధులు మంజూరైనా మరమ్మతులు చేపట్టని అధికారులు
- ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది



శాలిగౌరారంలో ఎండిపోయిన తాగునీటి బోరు



ట్యాంకర్ ద్వారా తాగునీటిని అందిస్తున్న సిబ్బంది

శాలిగౌరారం: మండల కేంద్రంలోని ప్రజలను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఆరు నెలలుగా శాలిగౌరారం మండల కేంద్రంలోని ప్రజలకు తాగునీరు అందడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లలోకి అడపాదడపా వచ్చే మిషన్ భగీరథ నీటితోనే కాలం వెళ్లదీసుకుంటున్నారు. వాహన సౌకర్యం కలిగినవారు వ్యవసాయ బావుల వద్దనుంచి నీటిని తెచ్చుకుంటూ అవసరాలను తీర్చుకుంటున్నారు. ఏ సౌకర్యం లేనివారు నీటికోసం అల్లాడుతున్నారు.

పూర్తిగా ఎండిపోయిన పంచాయతీ బోరు

శాలిగౌరారం మండల కేంద్రంలోని నకిరేకల్ రోడ్డు వెంట 200 అడుగుల లోతులో బోరు వేసి ఆ బోరు ద్వారా దశాబ్ద కాలంగా వ్యాపార దుకాణాలు, నివాస గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలకు తాగు నీటిని అందిస్తున్నారు. కొంతకాలంగా తక్కువ నీటిని అందిస్తూ వచ్చిన ఈ బోరు.. ఏప్రిల్‌లో పూర్తిగా ఎండిపోయి చుక్కనీరు రావడంలేదు. దీనికి తోడు పైపులైన్ పూర్తిగా ధ్వంసమైంది. బోరు పూర్తిగా ఎండిపోవడం.. ప్రత్యామ్నాయ బోరు లేకపోవడంతో ఈ బోరు పరిధిలోని ప్రజలు నీరు అందక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రానికి వచ్చే ప్రజలు దుకాణాల్లో తాగునీటిని కొనుగోలు చేసి దాహార్తిని తీర్చుకుంటున్నారు.

నిధులు మంజూరైనా..

మండల కేంద్రానికి తాగునీటిని అందించే గ్రామ పంచాయతీ బోరు ఎండిపోవడంతోపాటు బోరుకు సంబంధించిన పైపులైన్ పూర్తిగా ధ్వంసమైంది. దీంతో నూతన పైపులైన్ నిర్మాణానికి మండల పరిషత్ అభివృద్ధి నిధుల నుంచి మూడు నెలల క్రితం రూ.3 లక్షలు మంజూరయ్యాయి. కానీ సంబంధిత విభాగానికి చెందిన ఓ అధికారి వ్యవహార శైలివల్ల పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. దీంతో తాగునీటి బోరు మరమ్మతులకు నోచుకోవడం లేదు. నూతన బోరు మంజూరు కోసం స్థానిక నేతలు ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.

నీటి కోసం అవస్థలు పడుతున్నాం

ఆరు నెలలుగా గ్రామ పంచాయతీ బోరు నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. ఇళ్లలోకి చుక్కనీరు రాకపోవడంతో నానా అవస్థలు పడుతున్నాం. పండుగలు, శుభకార్యాల సమయంలో అయితే మా బాధలు వర్ణనాతీతం. పంచాయతీ సిబ్బంది ట్యాంకర్లతో అందించే నీటిని పొదుపుగా వాడుకుంటూ కాలం వెల్లదీస్తున్నాం.

– ఆదె స్వప్న, భైరవునిబండ రోడ్డు, శాలిగౌరారం

భగీరథ నీటిని సరిపడా అందించాలి

మిషన్ భగీరథ తాగునీరు పావుగంటకు మించి రాకపోవడంతో వచ్చిన నీరు తాగేందుకు కూడా సరిపోవడం లేదు. గ్రామంలో జనాభా ఎక్కువ ఉన్నారు కాబట్టి మిషన్ భగీరథ నీటిని రెండు విడతలుగా విడుదల చేయాలి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి శాలిగౌరారంలో తాగునీటి సమస్యను తీర్చాలి.

– లింగయ్య, భైరవునిబండ రోడ్డు, శాలిగౌరారం

ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నాం

మండల కేంద్రానికి నీటి సరఫరా చేసే పంచాయతీ బోరు ఆరునెలల క్రితం ఎండిపోయిన విషయం వాస్తవమే. కొత్తగా మరోచోట బోరు వేసేందుకు నిధులు లేవు. తాగునీటి సమస్య, నూతన బోరు మంజూరు విషయాన్ని మండల అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోయాం. ట్యాంకర్ ద్వారా ఆరు నెలలుగా నీటి సరఫరా చేస్తున్నాం.

– విజయ్, పంచాయతీ కార్యదర్శి, శాలిగౌరారం

రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, రైతులు

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ వందశాతం రుణమాఫీ అమలు చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేతేపల్లి తహసీల్దారు కార్యాలయం ఎదుట రైతులతో కలిసి చిరుమర్తి లింగయ్య గురువారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రూ.2లక్షల రుణమాఫీ వందశాతం అమలు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో 50శాతం కూడా అమలు కాలేదన్నారు. యాసంగి పంట వేసే సమయం వస్తున్నా.. వానాకాలం రైతు భరోసా ఊసెత్తకపోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. దసరా పండుగలోపు రైతులందరికీ రుణమాఫీ అమలు చేయడంతోపాటు రైతు భరోసా నిధులను జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, కేతేపల్లి మాజీ ఎంపీపీ బడుగుల శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం వెంకట్‌రెడ్డి, చీమట వెంకన్న, రైతులు ఉన్నారు.

మున్సిపాలిటీని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తా

- నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితను సత్కరిస్తున్న నాయకులు

నకిరేకల్ : స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో నకిరేకల్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానని నకిరేకల్ మున్సిపల్ నూతన చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం ఆమె చైర్‌పర్సన్‌గా ఎన్నిక కావడంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన మున్సిపల్ కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. తన పదవీ కాలం మరో రెండేళ్లలోపే ఉన్నందున మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో నిధులు తెప్పించి నకిరేకల్ పట్టణాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ మెంబర్ చామల శ్రీనివాస్, నాయకులు మాద యాదగిరి, బచ్చుపల్లి గంగాధర్ రావు, పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, నకిరేకంటి నరేందర్, ఉగ్గిడి శ్రీనివాస్, బ్రహ్మదేవర రమేష్, యాసారపు వెంకన్న తదితరులు ఉన్నారు.

ప్రతి కుటుంబం వివరాలు సేకరించాలి

- చండూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం



మునుగోడు: జమస్థాన్‌పల్లిలో డిజిటల్ కార్డు సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ సుబ్రహ్మణ్యం

మునుగోడు: ప్రతి కుటుంబం వివరాలు క్షుణంగా పరిశీలించి డిజిటల్ కార్డు కోసం సర్వే చేపట్టాలని చండూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం అధికారులకు సూచించారు. గురువారం మునుగోడు మండలంలోని జమస్థాన్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న డిజిటల్ కార్డు సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడారు. ఒక ఇంటికి వెళ్లినప్పుడు ఆ కుటుంబ సభ్యులందరిని కలిపి ఫొటో తీయడంతో పాటు ఆ కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు సేకరించాలన్నారు. సేకరించిన వివరాలను సాయంత్రం లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.నరేందర్, ఎంపీడీఓ పూజ, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, మండల పంచాయతీ అధికారి స్వరూపరాణి, ఆర్‌ఐ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ కుటుంబ సర్వే పక్కాగా చేపట్టాలి

నల్లగొండ టూటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న డిజిటల్ కుటుంబ సర్వేను సమగ్ర వివరాలతో పక్కాగా చేపట్టాలని ఇన్‌చార్జ్ ఆర్డీఓ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. గురువారం నల్లగొండ పట్టణ పరిధిలోని 4వ వార్డులో డిజిటల్ కుటుంబ సర్వేను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన ప్రొఫార్మా ప్రకారం కుటుంబ సభ్యులందరి వివరాలను నమోదు చేయాలన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలందరి వివరాలు తెలుసుకోవాలన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా చేపడుతున్నందున ఎక్కడ కూడా పొరపాట్లు లేకుండా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏసీపీ సిద్దుఖా, ఈఈ రాములు, డీఈ అశోక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గంగన్నపాలెంలో ఇంటింటి సర్వే

తిప్పర్తి : మండలంలోని గంగన్నపాలెం గ్రామంలో ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డులను మంజూరు చేయడానికి గురువారం ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డును జారీ చేయడానికి నల్లగొండ నియోజకవర్గంలోని తిప్పర్తి మండలం గంగన్నపాలెం గ్రామాన్ని ప్రథమంగా ఎంపిక చేసిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వప్న, మాజీ సర్పంచ్ మర్రి యాదయ్య, పంచాయతీ కార్యదర్శి, అధికారుల బృదం పాల్గొన్నారు.

చండూరు : ప్రతి ఇంటికి యూనిక్ ఐడీతో ఫ్యామిలీ డిజిటల్ కార్డు జారీ చేయడానికి ప్రభుత్వ చేపట్టిన సర్వేకు ప్రజలు సహకరించాలని ఆర్డీఓ సుబ్రహ్మణ్యం అన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా చండూర్ మున్సిపాలిటీలోని మూడో వార్డులో చేపట్టిన డిజిటల్ సర్వేను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కుటుంబ సభ్యులు అందుబాటులో ఉండి డిజిటల్ ఫొటో దిగాలన్నారు. ఈనెల 7వతేదీలోగా దూర ప్రాంతాల్లో ఉన్నవారు సైతం గ్రామానికి వచ్చి ఫొటో దిగాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ, గట్టుప్పల్, మునుగోడు తహసీల్దార్లు రాములు, శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ టూటౌన్ : ఉద్యోగులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్



తిప్పర్తి : సర్వే చేస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ



పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న సోమగాని శంకర్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు

కట్టంగూర్ : మండల కేంద్రంలోని కురుమర్తి రోడ్డులో గల కంఠమహేశ్వరస్వామి ఆలయం పక్కనే నూతనంగా ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని గురువారం రాఘవేంద్ర కళాశాల చైర్మన్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సోమగాని శంకర్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బహుజన రాజ్యం కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప మహనీయుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. నిజాం పాలకులకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి బహుజనుల అభ్యున్నతికి కృషి చేశారని, ఆయన బాటలో బహుజనులు, గౌడకులస్తులు నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పుల్లెంల రవిందర్‌కుమార్‌గౌడ్, చల్లమల్ల వెంకటేశ్వర్లు, యర్కల సత్తయ్యగౌడ్, ఐతగోని రాములుగౌడ్, కక్కిరేణి వెంకటేశ్వర్లుగౌడ్, చెనగోని శ్రీనివాసులుగౌడ్, ఐతగోని లక్ష్మీనారాయణగౌడ్, పోగుల నాగేష్ తదితరులు ఉన్నారు.

ఈదురుగాలులతో వర్షం

శాలిగౌరారం : మండలంలో గురువారం రాత్రి బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలో 15.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా ఈదురుగాలుల దాటికి కంకి, కోతదశలో ఉన్న వరిచేలు నేలవాలాయి. పత్తి తీసేదశలో ఉండటంతో నేల రాలింది. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అదేవిధంగా లోతట్టు ప్రాంతాలలోని పంటపొలాల మీదుగా వరదనీరు ప్రవహిస్తుండడంతో వరి పంటలు దెబ్బతిన్నాయి. వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని పలువురు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



పట్టణంలోని చంద్రగిరి విల్లాస్ వద్ద బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



ప్రకాశంబజార్‌లో మటన్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్



జెల్‌ఖానా వద్ద ప్రైమరీ హెల్త్ సెంటర్ పనులు పరిశీలిస్తున్న మంత్రి



క్యాంపు కార్యాలయంలో మంత్రికి వినతిపత్రాలు అందజేస్తున్న ప్రజలు

ఘనంగా దుర్గాదేవి నవరాత్రోత్సవాలు ప్రారంభం



నల్లగొండ : శ్రీనివాసనగర్ కాలనీలో బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు



నల్లగొండ : రామగిరి ముత్యాలమ్మ ఆలయంలో పూజలు

రామగిరి(నల్లగొండ): దేవీ నవరాత్రి ఉత్సవాలు నల్లగొండ పట్టణంలో గురువారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నల్లగొండ పట్టణంలోని పలువురు భవానీ మాలధారులు, భక్తులు భజనలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముత్యాలమ్మ ఆలయంలో..

పట్టణంలోని రామగిరి ముత్యాలమ్మ దేవాలయంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారిని అలంకరించి భవానీ స్వాములు పూజలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, పూజారి ఎలిజాల అంజయ్య, నాగరాజు, పవన్, వంశీ, దీపక్, శివ, భాస్కర్, చక్రి, చంద్రకళ, శ్రీకళ, మానస, కీర్తి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

చిట్యాల: పట్టణంలోని శ్రీకనకదుర్గ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులుగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, కాకులారపు బొర్రారెడ్డి, బుద్ధ విమల, గంజి వెంకటేశం, వరకాంతం నరసింహారెడ్డి, రుద్రారపు లింగస్వామి, జిట్ట సాయిలు, నిఖిల్‌కుమార్ పాల్గొన్నారు.

కేతేపల్లి : మండలంలోని వివిధ గ్రామాలలో గురువారం దేవీనవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కేతేపల్లి, గుడివాడ, కొత్తపేట, ఇనుపాముల, బొప్పారం తదితర గ్రామాలలో ప్రత్యేకంగా అలంకరించిన మండపాలలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమపూజ, శ్రేసాయుక్త, నవాభరణ, అష్టోత్తర, శతనామ, తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

శాలిగౌరారం : మండలంలో దుర్గాదేవి నవరాత్రోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటి రోజు అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అవతారంతో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవి నవరాత్రోత్సవాల సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలో పలువురు భక్తులు దుర్గాదేవి మాలాధారణ చేపట్టారు. మండల కేంద్రంలో స్థానిక పురోహితుడు రామడుగు వెంకటరామశర్మ నేతృత్వంలో దేవి నవరాత్రోత్సవ పూజలు జరుగనున్నాయి. మండల కేంద్రంలో నిర్వహించిన పూజల్లో దుర్గాదేవి మాలాధారణ భక్తులు దేవేందర్, సత్తయ్య, శంకర్, సాయిభార్గవ్, సంతోష్, శివమణి తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల : శ్రీకనకదుర్గా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



నల్లగొండ : రాక్‌హిల్స్ కాలనీలో దుర్గాదేవీ పూజలో పాల్గొన్న భక్తులు



శాలిగౌరారంలో దుర్గాదేవి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



కేతేపల్లి : శివాలయంలో దుర్గాదేవి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు